
సాక్షి ఖమ్మం

గురువారం । 5 । జనవరి । 2023



రెపరెపలాడిన మిర్చి, పత్తి ధరలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి, పత్తి ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

10లో

గరిష్టం / కనిష్టం 30° / 19°

వాతావరణం

గురువారం ఉదయం చాలాచోట్ల మంచు ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

దప్పులతో నృత్యం చేస్తున్న యువతులు





-వివరాలు

8లో..

ధూంధాంగా యువజనోత్సవం

హుషారెత్తించిన జానపద గీతాలు.. వాటికి అనుగుణంగా యువతీ, యువకుల నృత్యాలు.. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పోటీ పడగా, ఇదే తరహాలో పాటల పోటీలూ సాగాయి. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొన్న వారు పోటీపోటీగా ప్రదర్శనలు ఇవ్వగా ఇందుకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా నిలిచింది. జిల్లా నలుమూలల నుంచి 400మంది హాజరైన ఈ పోటీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. ఇక పోటీదారులతో పాటు హాజరైన వారు ఈలలు, చప్పట్లతో తమ సహచరులను ఉత్సాహపరిచారు. – ఖమ్మం స్పోర్ట్స్

న్యూస్‌రీల్

ఢిల్లీ వర్క్‌షాప్‌కు జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్



ఖమ్మంసహకారనగర్: కేంద్రప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యాన గ్రామీణాభివృద్ధిపై గురు, శుక్రవారాల్లో ఢిల్లీలో జరగనున్న వర్క్‌షాప్‌లో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పాల్గొననున్నారు. ఢిల్లీలోని జన్‌పథ్ డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో అన్ని రాష్ట్రాల్లోని జిల్లాల అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి ప్రణాళికలపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఈ సమావేశాలకు తెలంగాణ ప్రతినిధిగా పాల్గొనేందుకు ఖమ్మం జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈమేరకు ఆయన పలువురు అధికారులతో కలిసి బుధవారం ఢిల్లీ బయలుదేరారు. తెలంగాణలోని గ్రామాల్లో సీఎం కేసీఆర్ నేతృత్వాన జరుగుతున్న అభివృద్ధిపై ఈ వర్క్ షాప్‌లో మాట్లాడనున్నట్లు చైర్మన్ తెలిపారు.

పనుల్లో అలసత్వం వద్దు..



పనులపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్

కారేపల్లి: కారేపల్లి మండలంలో అదనపు కలెక్టర్ స్నేహలత బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా మండలంలోని ఉసిరికాయలపల్లి, సూర్యతండా, సంద్రళ్లగూడెం గ్రామాల్లో జరుగుతున్న ప్రధాన మంత్రి ఆదర్శ్ యోజన, మన ఊరు–మన బడి పనులను ఆమె పరిశీలించారు. మన ఊరు–మన బడి పనుల్లో అలసత్వం వహించకుండా, త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. నిధులు మిగిలితే పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ రాజారావు, సర్పంచ్ బానోతు బస్సీలాల్, కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొఉన్నారు.

మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టుల భర్తీ

ఖమ్మం వైద్యవిభాగం: బస్తీ, పల్లె దవాఖానాల్లో ఖాళీగా ఉన్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.మాలతి తెలిపారు. పట్టణ దవాఖాలో ఒకటి, పల్లె దవాఖానాల్లో 69 పోస్టులు ఖాళీగా ఉండగా, ఏడాది పాటు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియామకాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో వరుసగా ఎంబీబీఎస్, బీఏఎంఎస్, స్టాఫ్‌నర్స్ శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. అర్హులు డీఎంహెచ్‌ఓ, ఖమ్మం పేరిట తీసిన రూ.300 డీడీ జతచేసిన దరఖాస్తులను ఈనెల 7లోగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లేదా ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా అందజేయాలని ఆమె సూచించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాయకల్ప బృందం



పెనుబల్లి ఆస్పత్రిలో పరిశీలిస్తున్న బృందం

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: సత్తుపల్లి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని కాయకల్ప బృందం బుధవారం సందర్శించింది. ఆస్పత్రిలోని వార్డులు, డయాలసిస్ కేంద్రం, సీమాంక్ సెంటర్, ఆపరేషన్ థియేటర్, కాన్పుల గదులను బృందం సభ్యులు పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే, ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత, బయోమెడికల్ వేస్టేజీ అమలు తీరును పరిశీలించారు. కాయకల్ప బృందం సభ్యులు డాక్టర్ పీ.వీ.సత్యనారాయణ, డాక్టర్ ఎం.మల్లికార్జున్, సిబ్బంది అనిత, ప్రీతి, రవీందర్‌తో పాటు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్, ఎస్.ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఇక పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిని కూడా ఇదే బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రి వైద్యాధికారి బి.రమేష్‌బాబు, వైద్యులు రంజిత్‌కుమార్, శరత్, విజ్ఞ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ షెడ్డు నిర్మాణానికి రూ.2లక్షలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 11వ డివిజన్‌లోని మైసమ్మ ఆలయ షెడ్డు నిర్మాణానికి భవాని మెస్ అధినేత దివంగత మోర్లా కనకయ్య కుమారుడు శ్రీనివాసరావు – అనూష బుధవారం రూ.2లక్షలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా వారిని కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు, సరిపుడి రమాదేవి సతీష్, ఆలయ బాధ్యులు సన్మానించారు.

అధికారులూ.. తీరు మార్చుకోండి

- అటవీ, విద్యాశాఖ అధికారుల తీరుపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం
- పలు శాఖలపై సుదీర్ఘంగా చర్చ
- వాడీవేడిగా సాగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ కమల్‌రాజ్, పక్కన సీఈఓ అప్పారావు తదితరులు

ఖమ్మం సహకారనగర్: చాన్నాళ్ల తర్వాత జెడ్పీ సర్వసభ్య సమావేశంలో దాదాపు అన్ని శాఖలపై సమీక్ష సమగ్రంగా సాగింది. ఒక్కో శాఖకు సంబంధించి అధికారులు నివేదికలు వెల్లడిస్తుండగా.. సభ్యులు సమస్యలను వివరించి పరిష్కారానికి పట్టుబట్టారు. ఈక్రమంలోనే విద్యాశాఖ, అటవీ శాఖల అధికారులపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. ఇక కలెక్టర్ సమావేశానికి రాకపోవడం, అదనపు కలెక్టర్ కాసేపు ఉండి వెళ్లడంపై కూడా సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏదిఏమైనా బుధవారం జరిగిన జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష జరగడం, సమస్యల పరిష్కారంపై అధికారులు స్పష్టత ఇవ్వడం విశేషం.

బాధ్యతగా వ్యవహరించండి..

అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి. చిన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలి. కేజీబీవీల్లో గ్యాస్ లేని అంశంపై కూడా జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది. సరిగ్గా పనిచేయని సిబ్బందిపై చర్యలు తీసుకోండి... మధిర నియోజకవర్గంలో హరితహారం ద్వారా రహదారి వెంట నాటిన చెట్లు దగ్ధమవుతున్నా అటవీ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని సమావేశానికి అధ్యక్షతన వహించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, విద్య, వైద్యం తదితర పథకాలకు ప్రాధాన్యతనిస్తూ అర్హులందరికీ పథకాలు చేరేలా చూస్తోందని తెలిపారు. కాగా, 24గంటల విద్యుత్ సరఫరాకు బుధవారంతో ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామని పేర్కొన్నారు.

శాఖల వారీగా ఇలా....

- జెడ్పీ సమావేశంలో తొలుత విద్యుత్ శాఖాధికారి సురేందర్ నివేదికలు సమర్పించగా కారేపల్లి, ఏన్కూరు, ఎర్రుపాలెం, పెనుబల్లి జెడ్పీటీసీలు వాంకుడోతు జగన్, బాదావత్ బుజ్జి, శీలం కవిత, చెక్కిలాల మోహన్‌రావు, ముదిగొండ, బోనకల్ ఎంపీపీలు సామినేని హరిప్రసాద్, సౌభాగ్య తదితరులు మాట్లాడుతూ తమ మండలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి వైర్లు వేలాడుతున్నాయని, శ్మశాన వాటికలకు కనెక్షన్ ఇవ్వడం లేదని పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు.
- వైద్యశాఖ సమీక్షలో కంటి వెలుగు అమలు ప్రణాళికలను డీఎంహెచ్‌ఓ మాలతి వివరించగా... కారేపల్లి జెడ్పీటీసీ వాంకుడోతు జగన్ మాట్లాడుతూ కొన్నిచోట్ల రైతు వేదికలు గ్రామాలకు దూరంగా ఉన్నాయని చెప్పడంతో కంటివెలుగు నిర్వహణ స్థలాన్ని మార్చుకోవచ్చని తెలిపారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లాల్ మహ్మద్, ఎర్రుపాలెం జెడ్పీటీసీ శీలం కవిత మాట్లాడుతూ విద్యార్థులకు సైతం కంటి పరీక్షలు నిర్వహించాలని కోరగా, కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్‌కుమార్ పీహెచ్‌సీలో 24గంటలు వైద్యసేవలందించాలని విన్నవించారు.
- విద్యాశాఖ సమీక్షలో భాగంగా తొలిమెట్టు, మన ఊరు–మన బడి అంశాలపై డీఈఓ సోమశేఖర శర్మ నివేదిక సమర్పించారు. కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ గోవింద్రాల తదితర పాఠశాలల్లో గతంలో చేసిన పనులకే రంగులు వేసి బిల్లులు సమర్పిస్తున్నారని చెప్పగా విచారణ చేస్తామని డీఈఓ తెలిపారు. అనంతరం రఘునాథపాలెం, బోనకల్ జెడ్పీటీసీలు మాలోతు ప్రియాంక, మోదుగు సుధీర్‌బాబు తదితరులు మాట్లాడుతూ కేజీబీవీల్లో అసౌకర్యాలు, అధికారుల పర్యవేక్షణ లోపంపై ప్రశ్నించారు. ఈమేరకు జెడ్పీ చైర్మన్ జోక్యం చేసుకుంటూ అవసరమైన పాఠశాలల్లో ప్రహరీలు, అదనపు తరగతి గదులు నిర్మించేలా చూడాలని సూచించారు.
- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థపై డీఆర్డీఓ విద్యాచందన నివేదిక సమర్పించగా.. తిరుమలాయపాలెం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ బృహత్ పల్లెప్రకృతి వనాన్ని కొక్కిరేణిలో ఏర్పాటుచేయడాన్ని ప్రస్తావిస్తూ నిర్వహణ లోపాలను వివరించారు. ముదిగొండ ఎంపీపీ హరిప్రసాద్ కూడా హరితహారం మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యంగా ఉన్నారని పేర్కొనడగా జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ జోక్యం చేసుకుని జిల్లాలోని అనేక చోట్ల ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. అటవీశాఖాధికారులు అడవిలో మొక్కలను రక్షించడమే కాక హరితహారం మొక్కలను కూడా కాపాడాలని సూచించారు. ఒక ప్రాంతంలో జేసీబీ యజమానికి రూ.80వేలు జరిమానా ఏ ప్రాతిపదికన విధించాలరో చెప్పాలని సూచించగా, ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని ఎఫ్‌డీఓ ప్రకాష్‌రావు తెలిపారు. అలాగే, గ్రామ కార్యదర్శుల పరస్పర బదిలీకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా అధికారులు స్పందించకపోవడంపై రఘునాథపాలెం జెడ్పీటీసీ ప్రియాంక ప్రశ్నించగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ అప్పారావు తెలిపారు.
- డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, ఇంగ్లిష్ మీడియం బోధన, కంటివెలుగు ప్రణాళికలపై ఆరా తీశారు. ఇంకా ఈసమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, అదనపు కలెక్టర్ స్నేహలత, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
- జెడ్పీ సర్వసభ్య సమావేశానికి మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలెవరూ హాజరుకాలేదు. కాగా, కలెక్టర్, అదనపు కలెక్టర్ వస్తే సమస్యల పరిష్కారానికి వీలుంటుందని కారేపల్లి, రఘునాథపాలెం జెడ్పీటీసీలు జగన్, ప్రియాంక చెప్పడంతో ఉన్నతాధికారులతో సమీక్ష ఉన్నందున కలెక్టర్ రాలేదని జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తెలిపారు.

మనోళ్లు మంచోళ్లు!

- ఇళ్లలోనే ఎక్కువ మంది 'నూతన' వేడుకలు
- ఫలితమిచ్చిన పోలీసు ఆంక్షలు
- డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఏడు మాత్రమే...



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



పాత బస్టాండ్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ అంజలి (ఫైల్)

ఖమ్మంక్రైం : ఒకటీ, అర ఘటనలు తప్ప నూతన సంవత్సరం వేడుకలు ఈ ఏడాది ప్రశాంతంగా ముగిశాయి. ఏటా మందుబాబుల హల్‌చల్, రహదారులపై బైక్‌లతో విన్యాసాలు, గొడవలు, ప్రమాదాలు నిత్యకృత్యమయ్యేవి. నూతన సంవత్సరం వచ్చిందంటే రాత్రి 10గంటలు మొదలు తెల్లవారే వరకు రోడ్లపై ఎక్కడ చూసినా యువత కనిపించేవారు. కానీ ఈసారి పరిస్థితి మారిపోయింది. అటు ఆంక్షలు, ఎక్కడికక్కడ బందోబస్తు, ప్రతీ కూడలిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టనున్నట్లు పోలీసులు ముందుగానే ప్రకటించడంతో మందుబాబులే కాదు యువత వెనుకడుగు వేశారు. అయితే, పలువురు నూతన సంవత్సరానికి మద్యంతో స్వాగతం పలికినా చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారు. అందుకే 31వ తేదీ అర్ధరాత్రి నుంచి 1వ తేదీ తెల్లవారుజామున వరకు ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో కేవలం ఏడుగురే పట్టుబడ్డారని చెబుతున్నారు.

తనిఖీలతో జంకిన యువత

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాత్రి 10గంటల తర్వాత ఇష్టారాజ్యంగా తిరిగినా, వాహనాలతో విన్యాసాలు చేస్తూ ఇతరులను ఇబ్బంది పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ విష్ణు ఎస్.వారియర్ ముందుగానే ప్రకటన విడుదల చేశారు. దీనికి తగినట్లుగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయడంతో యువత రోడ్లపైకి రావడానికి జంకారు. చాలా ప్రాంతాల్లో రాత్రి 11గంటల తర్వాత కనీస సంచారం కూడా కనిపించలేదు. ఇక 12గంటలకు కాలనీ కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద పలువురు బయటకు వచ్చినా కేక్ కట్ చేసి మళ్లీ ఇళ్లకే పరిమితమయ్యారు. అనంతరం కుటుంబాలతోనే ఇళ్లలో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ వేడుకలు జరుపుకున్నామని పలువురు పట్టణ వాసులు వెల్లడించారు.

దిగ్బంధం చేసిన పోలీసులు

నగరంలో అన్ని ప్రధాన కూడళ్లలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. సుమారు పది చోట్ల పికెట్లు ఏర్పాటు చేసి పోలీసులు రాత్రి 10గంటల నుంచే రోడ్లపై తిరుగుతున్న వారిని ఇళ్లకు పంపించారు. అర్ధరాత్రి 12గంటల వరకు వైన్స్, ఒంటి గంట వరకు బార్లు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే, వైన్స్, బార్లలో మద్యం సేవించి రహదారులపైకి వస్తే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడతామనే భయంతో చాలా మంది మందుబాబులు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో పెద్దగా రద్దీ లేని కారణంగా చాలాచోట్ల 11గంటలకే వైన్స్ మూసివేయడం గమనార్హం.

పట్టుబడింది ఏడుగురే...

నూతన సంవత్సరం సందర్భంగా ఈసారి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే, డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఏడు మాత్రమే నమోదు కావడం గమనార్హం. గత సంవత్సరం 15కేసులు నమోదు కాగా ఈసారి సగానికి తగ్గిపోయాయి. కేసుల భయంతో చాలా మంది ఇళ్లలోనే మందు పార్టీలు ఏర్పాటుచేసుకోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. పోలీసు ఆంక్షలే పనిచేశాయో.. కేసులకే భయపడ్డారో.. తనిఖీలు అంతంత మాత్రంగా సాగాయో తెలియదు కానీ ఇళ్లకే పరిమితమై నూతన సంవత్సరాన్ని అంతా కలిసి స్వాగతించడం చాలా కుటుంబాల్లో ఆనందాన్ని నింపిందనే చెప్పాలి.

మార్కెట్ చైర్‌పర్సన్‌గా శ్వేత

- వైస్ చైర్మన్‌గా షేక్ అఫ్జల్
- మంత్రి పువ్వాడ సిఫారసుతోనే ఖమ్మం మార్కెట్ కమిటీ
- కొత్తగా ఇంకో నలుగురు రైతులకూ అవకాశం





ఖమ్మం వ్యవసాయ మార్కెట్ (ఇన్‌సెట్) దోరేపల్లి శ్వేత

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీ ఖరారైంది. ఈనెల 28తో ప్రస్తుత కమిటీకి పదవీ కాలం ముగియనుండడంతో నూతన కమిటీ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. రిజర్వేషన్లు, రోస్టర్ ఆధారంగా మార్కెట్ చైర్‌పర్సన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. ఈమేరకు 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేతను చైర్‌పర్సన్‌గా, రఘునాథపాలెం మండలం ర్యాంకాతండాకు చెందిన ప్రస్తుత డైరెక్టర్ షేక్ అఫ్జల్‌ను వైస్ చైర్మన్‌గానే కాక మరో 12 మందిని డైరెక్టర్లుగా ప్రతిపాదించారు. సీఎం కేసీఆర్ అనుమతితో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ద్వారా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌గా డౌలె లక్ష్మీప్రసన్న ఉన్న కమిటీని 2021 జూలై 29న నియమించగా, 2022 జూలై 28తో గడువు ముగియడంతో ఆరు నెలల పాటు పొడిగించారు. ఈ పదవీకాలం 28వ తేదీన ముగియనున్న నేపథ్యాన కొత్త పాలకవర్గం ఏర్పాటుకు మంత్రి సిఫారసు చేశారు.

రెండేళ్ల కాలపరిమితితో కమిటీ

ఖమ్మం మార్కెట్ నూతన కమిటీకి రెండేళ్ల కాలపరిమితిని నిర్దేశించారు. మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను అమలుచేసిన ప్రభుత్వం తొలుత ఏడాది కాలపరిమితిగా నిర్ణయించినా, పనితీరు, ఇతర కారణాలతో ఆరు నెలల చొప్పున ఇంకో ఏడాది పొడిగించే అవకాశమిచ్చారు. అయితే, గత ఏడాది మార్కెట్ కమిటీల కాలపరిమితిని రెండేళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రస్తుతం ఏర్పాటు చేసే కమిటీ 2025 జనవరి 28 వరకు అమలులో ఉండనుంది.

డైరెక్టర్లుగా మరో నలుగురు రైతులు

మార్కెట్ కమిటీల్లో గతంలో ఆరుగురు రైతులకు డైరెక్టర్లుగా అవకాశం ఉండగా, ఇంకో నలుగురికి స్థానం కల్పించాలని ప్రభుత్వం గతంలోనే జీఓ విడుదల చేసింది. దీంతో ఖమ్మం మార్కెట్ కమిటీలోకి నలుగురు రైతులు డైరెక్టర్లుగా నియమితులు కానున్నారు. మొత్తం 18 మందితో ఉండే కమిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, పది మంది రైతులు, ఇద్దరు ట్రేడర్లు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, మేయర్, మార్కెట్ పరిధిలోని ఒక పీఏసీఎస్ అధ్యక్షులు, వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు డైరెక్టర్లుగా ఉండనున్నారు.

గుంటు మల్లన్న భూమి రక్షణకు చర్యలు



ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా దేవాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఖమ్మం పత్తి యార్డు పక్కన(సుందరయ్యనగర్) ఉన్న 4.19 ఎకరాల ఆలయ భూమికి రక్షణ కల్పించేందుకు గాను బహిరంగ వేలం ద్వారా మూడేళ్ల పాటు లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఈఓ చందూరు రామకోటేశ్వరరావు తెలిపారు. మార్కెట్‌కు సమీపాన, పరిశ్రమల మధ్య ఉండడంతో ఈ భూమి వేలానికి మంచి స్పందన వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఈనెల 11వ తేదీన ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించనుండగా, ఆసక్తి ఉన్న వారు రూ.50 వేల డిపాజిట్‌తో హాజరుకావాలని ఈఓ సూచించారు.

పీపీఎల్ విజేత.. ఇండస్

- రన్నరప్‌గా ప్రకాష్ ప్రాజెక్ట్స్ జట్టు
- ట్రోఫీలు అందజేసిన మంత్రి పువ్వాడ



ఇండస్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ తదితరులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న సినీ హీరో సన్నీ

ఖమ్మం స్పోర్ట్స్: పువ్వాడ ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) టీ–20 క్రికెట్ టోర్నీ విజేతగా ఇండస్ హాస్పిటల్ ఖమ్మం జట్టు నిలిచింది. రన్నరప్ ట్రోఫీని ప్రకాష్ ప్రాజెక్టు భద్రాచలం జట్టు దక్కించుకుంది. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న పీపీఎల్ టోర్నీ బుధవారం ముగిసింది. ఈమేరకు ప్రకాష్ ప్రాజెక్ట్స్ – ఇండస్ హాస్పిటల్ జట్లు ఫైనల్స్‌లో తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాష్ ప్రాజెక్టు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 123 ఆలౌట్ అయింది. జట్టు బ్యాట్స్‌మెన్లులు రోనాల్డ్ 15, అనిరుధ్ 16, బన్నీ 37, నీరజ్ 9, తనుష్ 21 పరుగులు చేయగా, ఇండస్ జట్టు బౌలర్లలో అజయ్ నాలుగు, రాహుల్, లోకేష్ రెండేసి వికెట్లతో పాటు నందు ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇండస్ జట్టు 19.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ జట్టులో జయరాం 28, ముకేష్ 22, ప్రశాంత్ 11, సాయిరాహుల్ 13, అజయ్ 14, నందు పరుగులు చేశారు. ఇక ప్రకాష్ ప్రాజెక్ట్స్ జట్టు నీరజ్ నాలుగు వికెట్లు తీసుకోగా ఇందులో హాట్రిక్ ఉండడం విశేషం. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మేయర్ పునుకోల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ట్రోఫీలు అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.డీ.మసూద్‌పాషా, సీపీఐ, సీపీఎం నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, స్పర్శ హాస్పిటల్ అధినేత కాకి భాస్కర్, కార్పొరేటర్లు రాపర్తి శరత్, సందీప్, ఫారూక్, మమ్ము తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని పోటీలు నిర్వహిస్తాం

క్రీడాకారులను ప్రోత్సహించేలా జిల్లా కేంద్రంలో మరిన్ని పోటీలు నిర్వహిస్తామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. విజేతలకు ట్రోఫీలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ క్రికెట్ మాత్రమే కాక ఇతర క్రీడా పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని క్రీడా సంఘాలను కోరారు. పువ్వాడ ఉదయ్ కుమార్ స్మారకార్థం నిర్వహించిన పీపీఎల్ – 3ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాగా, అన్ స్టాపబుల్ హీరో సన్నీ ఈకార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, ఇలాంటి క్రికెట్ పోటీలు ఖమ్మంలో జరగడం గర్వంగా ఉందని చెప్పారు. ఈసందర్భంగా విజేత జట్టుకు రూ.2.50లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.1.50లక్షల నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు.

క్లుప్తంగా

పత్తి ధరల తగ్గింపుపై మంత్రికి ఫిర్యాదు


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ : సిండికేట్ అవతారం ఎత్తి, పత్తి ధర తగ్గిస్తూ రైతులకు నష్టం చేకూరుస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఏడాది పత్తి క్వింటాకు రూ.15వేల ధర ఉండగా, ఈసారి రూ.8వేలకు మించి చెల్లించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, నాయకులు రంగయ్య, బాబన్న పాల్గొన్నారు.

రైసెట్‌లో ఉచిత శిక్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని రైసెట్ కేంద్రంలో మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ విశాల్‌దేవ్ తెలిపారు. ఈనెల 9 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు ఉండి పదో తరగతి ఉత్తీర్ణులైన ఉమ్మడి జిల్లా వాసులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, నాలుగు ఫొటోలు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్సుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, టూల్ కిట్లు ఇస్తామని తెలిపారు.

మంత్రి గంగుల తండ్రి మృతిపై సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య(87) మృతిపై జిల్లా ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఈమేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం ప్రకటించడంతో పాటు కమలాకర్‌ను ఫోన్‌లో పరామర్శించారు. అలాగే, బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు కూడా సంతాపం తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లికి చెందిన ముల్కూరి నరేందర్‌రెడ్డి(37) మంగళవారం పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరేందర్‌రెడ్డి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కుటుంబీకులు చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలోనే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆయన పురుగుల మందు తాగగా కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స బుధవారం మృతి చెందాడు. ఆయన తండ్రి కృష్ణారెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

– అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు


లాలు (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని బద్యాతండాకు చెందిన బానోత్ లాలు(48) మరో వ్యక్తితో కలిసి చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బద్యాతండాకు చెందిన లాలు.. అదే గ్రామవాసి నూనావత్ చెందిన లాల్‌సింగ్‌తో కలిసి కొత్రబోడు తండా చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చెరువులోకి దిగి వల విసురుతుండగా లాలు చెరువులో మునిగి కన్నుమూశాడని లాల్‌సింగ్ వెల్లడించారు. అయితే, లాలు మృతిపై తమకు అనుమానం ఉందని మృతుడు సోదరుడు లాల్‌సింగ్ ఆరోపించారు. ఈమేరకు రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, లాలుకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

మరో ఇద్దరినీ విడిచిపెట్టిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు కాంట్రాక్టర్లను గత నెల 24న కిడ్నాప్ చేసిన మావోయిస్టులు ఇప్పటికే విడుదల చేయగా, మిగిలిన వారినీ విడుదల చేశారు. కిడ్నాప్ చేసిన కొండగావ్‌కు చెందిన నిమేంద్రకుమార్ దేవాన్, నీల్‌చంద్ నాగ్‌ను మంగళవారం విడిచిపెట్టిన విషయం విదితమే. లొహందిగూడకు చెందిన టటిమ్రు నాగ్, బార్సూర్‌కు చెందిన చప్పిడి బత్తయ్యను బుధవారం విడిచిపెట్టగా వారు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈమేరకు కాంట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని కిడ్నాప్‌నకు కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే, మావోయిస్టులు ఎవరికీ హానీ తలపెట్టకుండా సురక్షితంగా విడిచిపెట్టడంపై కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధూంధాంగా యువజనోత్సవం

- పోటీలకు హాజరైన 400 మంది కళాకారులు
- ఆడిపాడిన యువతీ, యువకులు
- ఉత్సాహంగా సాగిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు


పోటీల్లో విజేతలతో డీవైఎస్ఓ పరంధామరెడ్డి, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: మా ఊరి చింతల్లో కోలాటమాడుతున్న ఓ పిల్లో... అంటూ ఉర్రూతలూగించిన జానపద పాటలకు ఉర్రూతలూగించిన నృత్యాలకు తోడు పాటలు, వక్తృత్వ పోటీల్లో ఒకరిని మించి ఒకరు పోటీ పడిన జిల్లా యువజనోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలను బుధవారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఆర్‌టీఓ తోట కిషన్‌రావు, డీఐఈఓ రవిబాబు, డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ఒకరికి మించి మరొకరు సత్తా చాటగా... ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోటీలు సాయంత్రం ఆరు గంటల వరకు సాగాయి. జిల్లాలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులే కాక యువజన సంఘాల బాధ్యులు 400మందికి పైగా పాల్గొని తమ సత్తా చాటారు. జానపద నృత్యాలు, పాటలు, వక్తృత్వ పోటీలు జరగగా, ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు అందరూ కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తెలిపారు. యువజనోత్సవాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ జిల్లా కళలకు పుట్టినిల్లని.. ఈ ఘనతను కొనసాగించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో విద్యార్థులు, యువజన సంఘాలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు.


యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, మేయర్ నీరజ తదితరులు


నృత్యం చేస్తున్న యువతులు

అనంతరం మేయర్ నీరజ మాట్లాడగా జాతీయ యువజన అవార్డు గ్రహీత బండారుపల్లి లక్ష్మయ్య, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు ఉమాశంకర్, యువజన, క్రీడాశాఖ ఉద్యోగి మురళీధర్, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్, ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీతారత్నం ట్రస్ట్ సేవలు అభినందనీయం


పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న ఉదయశ్రీ తదితరులు

ఖమ్మంఅర్బన్: విద్యాసంస్థల్లో సౌకర్యాల కల్పనకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల అధికారి బి.ఉదయశ్రీ తెలిపారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం కేజీబీవీకి 20 కుర్చీలు అందజేశారు. స్పెషల్ ఆఫీసర్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఉదయశ్రీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య మనమరాలు బీమా, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, సరితాకుమారి, స్వరూపరాణి, రమాదేవి, మౌనిక, వసంత, రత్నశ్రీ, అంబిక, లావణ్య, రేణుక, లక్ష్మీస్వరూప, సునీత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర బాధ్యులకు సన్మానం


రాష్ట్ర నాయకత్వాన్ని సన్మానిస్తున్న అఫ్జల్

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, రాయకంటి ప్రతాప్‌ను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ సన్మానించారు. హైదరాబాద్‌లో బుధవారం వారిని నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందగిరి శ్రీను, నాయకులు వీర నారాయణ, బాగం పవన్, షేక్ నాగుల్ మీరా, నాగరాజేష్, ఆర్ఎన్.ప్రసాద్, శాబాసు జ్యోతి, శిరణ్మయి, స్వప్న, మల్లీశ్వరి పాల్గొన్నారు.

సహజీవనం చేసి పెళ్లికి నిరాకరిస్తున్నాడని
ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వప్న

పెనుబల్లి : భర్తతో విడాకులు తీసుకున్న మహిళ.. తన ప్రియుడితో సహజీవనం చేస్తుండగా ఆయన పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాళ్లగూడెంకు చెందిన కంటెపూడి స్వప్నకు గతంలో వివాహం జరగగా భర్తతో విడాకులు తీసుకుని ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలోని అక్కడ ఇంటి వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తోంది. అదే గ్రామానికి చెందిన మామిడి నాగరాజుతో ఏర్పడిన పరిచయంతో నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. అయితే, తనను పెళ్లి చేసుకోవాలని స్వప్న కోరగా నాగరాజును నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె బుధవారం వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇద్దరినీ పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం బయటకు వెళ్లిన స్వప్న నాగరాజు తనను పెండ్లి చేసుకోవడానికి ఒప్పుకోవడం లేదనే మనస్తాపంతో పోలీస్ స్టేషన్ ఎదుటే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను బంధువులు పెనుబల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఐదు షాపుల్లో చోరీ

ఒకే వ్యక్తి చేసినట్లుగా గుర్తింపు


చోరీ జరిగిన షాపులో పరిశీలిస్తున్న ఎస్సై కవిత

బోనకల్ : మండల కేంద్రంలో ఒకేరోజు రాత్రి ఐదు షాపుల్లో చోరీ జరిగింది. కాగా, ఈ చోరీలన్నీ ఒకే వ్యక్తి చేయడం గమనార్హం. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని భూక్యా శ్రీనివాసరావు ఫ్యాన్సీ షాపు వెనుకాల తాళం రింగ్ ప్రవేశించిన దుండగుడు క్యాష్ కౌంటర్‌లోని రూ.30 వేలు చోరీ చేయడమే కాక వస్తువులను చిందరవందరగా పడవేశాడు. ఆ తర్వాత అదే వరుసలో రెండు షాపులు వదిలేసి పర్సబోయిన వీరభద్రం హోటల్‌లోకి ప్రవేశించినా బీరువా పగులగొట్టడం సాధ్యం కాలేదు. అనంతరం మరో రెండు షాపులు వదిలేసి కలవాల సుబ్బారావు ఫ్యాన్సీ షాపులో చొరబడి రూ.3వేలు, స్టీల్ సామాను షాపు తాళం రింగ్, తలుపు కింద భాగం పగలగొట్టి కౌంటర్‌లోని రూ.15 వేలు దొంగిలించాడు. అంతేకాకుండా బంధం దుర్గారావు స్టీల్ సామాను షాపులో కాంటా, మర్సకంట్ల సంజీవరావు కిరాణం షాపులోనూ చోరీ చేశాడు. కాగా, బుధవారం ఉదయం సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా చోరీలన్నీ ఒకే వ్యక్తి పాల్పడినట్లు గుర్తించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కవిత పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

హాస్టల్ బాలికలు.. విజయవాడలో ప్రత్యక్షం

సత్తుపల్లి: సత్తుపల్లి గిరిజన బాలిక హాస్టల్ నుంచి ఈనెల 2వ తేదీ అదృశ్యమైన ఇద్దరు బాలికలను విజయవాడలో గుర్తించారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన బాలికలను పోలీసులు గుర్తించి చైల్డ్‌వెల్ఫేర్ కమిటీకి మంగళవారం రాత్రి అప్పగించారు. అనంతరం వారు ఇచ్చిన సమాచారంతో బాలికలను తీసుకొచ్చేందుకు హాస్టల్ వార్డెన్ మాధవి, విద్యార్థినుల తల్లిదండ్రులు, పోలీసు సిబ్బంది బుధవారం వెళ్లారని సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్ తెలిపారు. ఇద్దరు బాలికలు సురక్షితంగా ఉన్నట్లు తెలియటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నివేదిక ఇవ్వాలని ఆదేశించిన న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: సత్తుపల్లి వసతిగృహం నుంచి బాలికలు అదృశ్యమైన ఘటనపై నివేదిక సమర్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అబ్దుల్ జావీద్‌పాషా, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను జిల్లా జడ్జి డాక్టర్ టి.శ్రీనివాసరావు ఆదేశించారు. ఈమేరకు న్యాయమూర్తి బుధవారం గిరిజన సంక్షేమశాఖ డీడీకి లేఖ పంపారు. హాస్టల్‌లో బాలికల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఇతర వివరాలతో నివేదిక ఇవ్వాలని సూచించారు.

శిక్షణ తరగతుల్లో జిల్లా కాంగ్రెస్ నేతలు


శిక్షణలో పాల్గొన్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: సికింద్రాబాద్‌లోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన శిక్షణలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ధరణి లోపాలు, హాత్ సే హాత్ జోడో కార్యక్రమం, ఎన్నికల నిబంధనలు, నియామవళి, సభ్యత్వాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారని నాయకులు తెలిపారు. ఈ శిక్షణలో కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎం.డీ.జావీద్, పీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావుతో పాటు మాలోతు రాందాస్, శౌరి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు


కండక్టర్ నాగరాజుకు అవార్డు అందజేస్తున్న ఎండీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో కండక్టర్లు యనమల నాగరాజు, సీహెచ్.నరేష్, డ్రైవర్ టి.నర్సింహారావు విధి నిర్వహణతో పాటు ఎక్స్‌ట్రా మైలేజీ సాధించినందుకు గాను అవార్డులకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వారికి ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు. ఉద్యోగులకు డీఎం యు.రాజ్యలక్ష్మి, సీఐ విజయశ్రీ, ఎస్ఎం గద్దం శ్రీనివాసరావు, ఏడీసీలు, ఉద్యోగులు అభినందించారు.

నాటు సారా, బెల్లం స్వాధీనం


పట్టుబడిన వ్యక్తులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

ఖమ్మంక్రైం: నాటు సారాతో పాటు నల్లబెల్లంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సిబ్బంది తనిఖీల్లో భాగంగా ఖమ్మం నుంచి డోర్నకల్ వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని సోదా చేశారు. అందులో 29.7 క్వింటాళ్ల బెల్లం, 40కిలోల పటిక, ఐదు లీటర్ల నాటు సారా లభించగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో సీఐ సర్వేశ్వర్, ఎస్సైలు ముబీషిర్ అహ్మద్, వెంకటరమణతో పాటు ఎం.ఏ.కరీం, బాలు, సుధీర్, హరీష్, వెంకట్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పామును తప్పించే క్రమంలో ప్రమాదం

– ఒకరు మృతి... మరొకరి తీవ్రగాయాలు

వేంసూరు: రోడ్డుపై వెళ్తున్న పామును తప్పించే క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనటగా ఒకరు మృతి చెందారు. వేంసూరు మండలంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మండలంలోని దూళ్ల కొత్తూరుకు చెందిన కలపాల హరిప్రసాద్(50) తన ఇంట్లో పని చేసే వేల్పుల దాసుతో కలిసి మర్లపాడు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మర్లపాడు సెంటర్ నుంచి తిరువూరు రోడ్డులోని మర్రిచెట్టు సమీపాన రహదారిపై పాము కన్పించడంతో హరిప్రసాద్ ఒక్కసారిగా ద్విచక్ర వాహనాన్ని పక్కకు తిప్పగా, అదేసమయాన వస్తున్న భీమవరానికి చెందిన వ్యక్తి సైతం తన వాహనాన్ని అదే పక్కకు తిప్పారు. దీంతో ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన హరిప్రసాద్, దాసును 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స అందిస్తుండగానే హరిప్రసాద్ మృతి చెందగా, దాసు పరిస్థితి విషమంగా ఉంది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మైనర్‌తో పని చేయిస్తున్న వ్యక్తిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డు ఆటోనగర్‌లో మైనర్ బాలుడితో జేసీబీ హెల్పర్‌గా పనిచేస్తున్న గ్యారేజ్ యజమాని రాంబాబుపై కేసు నమోదైంది. ఖమ్మం కార్మిక శాఖ సహాయ అధికారి చల్లా వెంగమాంబ, రూరల్ ఎస్ఐ రవూఫ్‌కు అందిన సమాచారంతో బుధవారం ఆటోనగర్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా16ఏళ్ల బాలుడితో పనిచేయిస్తున్నట్లు తేలగా రాంబాబు కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.


సీఎంకు పుష్పగుచ్ఛాలు ఇస్తున్న వెంకటవీరయ్య, రాములునాయక్

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

సత్తుపల్లి / వైరా: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర.. తిరుమల ప్రసాదం అందజేయడంతో పాటు నియోజకవర్గంలోని మండలాలతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, వైరా ఎమ్మెల్యే సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా కేసీఆర్ సానుకూలంగా రాములునాయక్ తెలిపారు.

కృష్ణయ్య చెంత రామయ్యకు రాపత్తు సేవ


శ్రీకృష్ణాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా రాపత్తు సేవలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం శ్రీకృష్ణాలయంలో స్వామి వారికి రాపత్తు సేవ జరిగింది. తొలుత పల్లకీలో స్వామి వారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా శ్రీకృష్ణాలయానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, హారతి సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన లవకుశ కళారూపం ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో అర్చకులు, వేదపండితులు, అంబసత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం

శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కనులపండువగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, బుధవారాన్ని పురస్కరించుకుని ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి


మాట్లాడుతున్న సూర్య, పక్కన జానీమియా తదితరులు

రఘునాథపాలెం: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జానీమియా, మండల అధ్యక్షుడు జాటోత్ సూర్య పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన మండల డీలర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలవారి వేతనం చెల్లించడంతో పాటు దుకాణాలకు అద్దె చెల్లించే విషయమై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బాగం మాధవరావు, గౌరవ సలహాదారుడిగా కె.భిక్షమయ్య, అధ్యక్షుడిగా జీఎస్.సూర్య, ప్రధాన కార్యదర్శిగా గోవింద్, ఉపాధ్యక్షుడిగా వంకాయలపాటి వేణు, సహాయ కార్యదర్శిగా వత్సవాయి రామారావు, కోశాధికారిగా బిచ్చు ఎన్నికయ్యారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన డైలీవేజ్ కార్మికులు

అధికారుల చొరవతో కిందకు దిగొచ్చిన వర్కర్లు


వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న కార్మికులు

పాల్వంచ: గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేసే డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పాల్వంచలోని ఆశ్రమ గిరిజన హాస్టల్‌లో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కారు. అధికారులు, పోలీసుల చొరవతో కిందకు దిగారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన ఆశ్రమ వసతి గృహాలు, పాఠశాలల్లో పనిచేసే డైలీవేజ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలు చెల్లించాలని 70 రోజులుగా జిల్లా వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కార్మికులు వెంకట్రావు, అర్జున్, కృష్ణకుమారి, రమాకళ, కల్యాణ్, రాజేశ్వరి హాస్టల్‌లోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశారు. మరికొందరు కార్మికులు కూడా ట్యాంక్ ఎక్కుతుండగా అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు అడ్డుకున్నారు. తహసీల్దార్ రంగా ప్రసాద్, ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు తదితరులు ఆందోళనవద్దకు చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఐటీడీఏ డీడీ రమాదేవితో ఫోన్‌లో మాట్లాడించారు. వారంలోగా పెండింగ్ వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు వాటర్ ట్యాంక్‌పై నుంచి కిందకు దిగారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, సాయిరాం, మంగీలాల్, వెంకట్రావు, సేవ్యా, శాంత, కాంతమ్మ, కల్యాణి, లక్ష్మి, బాబూరావు, నర్సింహారావు, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.